# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 217 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 14 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

### అధికారులతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

హైదరాబాద్, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు నగరంలో భారత రాష్ట్రపతి ముర్ము పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేందుకు మాన్యువల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను

..మిగతా 2లో

# వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్




### కుట్రలు చేసిన బిఆర్ఎస్‌ను వదిలేది లేదు

ఎవరున్నా కఠినంగా శిక్షించి తీరుతాం

దాడులతో రాష్ట్రాన్ని అప్రతిష్ట చేసే యత్నం

దాడిని కెసిఆర్ ఎందుకు ఖండించడం లేదు

దాడులు చేస్తే మిన్నకుంటామనుకుంటే మూర్ఖత్వమే

రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బిఆర్ఎస్‌కు ఇష్టం లేదు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమాలు రావాల్సిందే

వేర్వేరుగా ఘాటుగా హెచ్చరించిన భట్టి,కోమటిరెడ్డి, పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేయగా, పట్నంకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామంలో జరిగిన ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసింది. బిఆర్ఎస్‌ను వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రులు హెచ్చరించారు. ఇప్పటికే ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఘాటు హెచ్చరికలు చేశారు. తాజాగా డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, పొంగులేటిలు ఘాటుగా స్పందించారు. వేర్వేరుగా మాట్లాడుతూ బిఆర్ఎస్ కుట్రలను ఛేదిస్తామని అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి చేయించింది బీఆర్ఎస్సేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. దాడులతో రాష్ట్రాన్ని ఏం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. కలెక్టర్‌పై దాడిని బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదని, పదేండ్లుగా సీఎంగా పనిచేసిన కేసీఆర్ దీనిపై మాట్లాడరేంటని భట్టి నిలదీశారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదని చెప్పారు. దాడి చేస్తే ఊరుకుంటామని అనుకుంటే మూర్ఖత్వమే అని అన్నారు. ఎవ్వరున్నా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదని, అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టి దాడి చేయించారని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. భూమి కోల్పోతున్న రైతుల బాధ తమకు తెలుసని, భూమి కోల్పోయే వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తున్నామని భట్టి చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితోనే రూరల్ ఏరియా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే భూసేకరణ కీలకమని ఆయన తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమని భట్టి స్పష్టం చేశారు. కొడంగల్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నామని, రూరల్ ఏరియాకు అభివృద్ధిని విస్తరింపజేస్తామని ఆయన వివరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము ప్రజల పక్షాన పోరాడామని, తాము ప్రతిపక్షంలో

..మిగతా 2లో



## ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్య విద్య

### దేశీయంగా మరో 75 వేల మెడికల్ సీట్ల పెంపు

పేదలకు ఆరోగ్యం చేరువ చేయాలన్న లక్ష్యం

దర్భంగా ఎయిమ్స్ శంకుస్థాపనలో ప్రధాని మోడీ

పాట్నా, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటు లోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. దేశీయ భాషల్లో వైద్యవిద్య వల్ల సామాన్యులకు అందుబాటులోకి రావడమే గాకుండా, వైద్య సేవల్లో నాణ్యత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల

..మిగతా 2లో

# పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్.. 14 రోజుల రిమాండ్



### రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరు ప్రస్తావన

హైదరాబాద్, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): వికారాబాద్ జిల్లా లగచర్ల దాడి ఘటనలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికారులపై దాడి ఘటనలో కుట్ర ఉందనే ఆరోపణలతో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజార్చేందుకు కేటీఆర్ సహా పార్టీ ఇతర నేతల ఆదేశాలతో వ్యూహ రచన జరిపామని పట్నం నరేందర్‌రెడ్డి చెప్పినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. ఇందులో భాగంగానే ప్రధాన నిందితుడు సురేశ్‌తో తరచూ ఫోన్ మాట్లాడినట్లు అంగీకరించారని వివరించారు. సాయంత్రం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి ఈనెల 27వరకు 14 రోజుల రిమాండ్ విధించారు. అంతకుముందు వికారాబాద్ పోలీస్ శిక్షణ కేంద్రంలో 3 గంటల పాటు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణ రెడ్డి విచారించారు. నరేందర్ రెడ్డి అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనల దృష్ట్యా

..మిగతా 2లో



## దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు

జడ్జిలా వ్యవహరించే అధికారం లేదు

ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది

నిందితులు అయినంత మాత్రాన ఇళ్లు కూల్చేస్తారా

రాష్ట్రాల బుల్డోజర్ న్యాయంపై సుప్రీం ఆగ్రహం

చర్యలు తీసుకునే అధికారులపై పెనాల్టీ

ఆక్రమణదారులకు తీర్పు వర్తించదు

సుప్రీం ధర్మాసనం కీలక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): బుల్డోజర్ల న్యాయంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎగ్జిక్యూటివ్ అధికారులు న్యాయ ప్రక్రియను తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితులను దోషిగా

..మిగతా 2లో

# సీఎం రేవంత్‌ది తుగ్లక్ పాలన

### రేవంత్ భరత్ పట్టడం ఖాయం

వారి అల్లుళ్ల ప్రయోజనాల కోసం ఫార్మా విలేజ్‌లు

ఫార్మాలా వన్ గురించి కనీస నాలెడ్జ్ కూడా లేదు.. రేవంత్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ విధానాల వల్ల రాష్ట్రంలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి.. సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం పడుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తన ఏడు ఎకరాల భూమి పోతుందనే కలెక్టర్‌ను సురేష్ అడిగాడని.. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే అని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ .. వాడో పిచ్చోడు.. ఫార్ములా వన్ ఈ రేసు గురించి ఆయనకేం తెలుసు. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జిలను కూడా తప్పుదోవ పట్టిస్తుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పాలన. రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతోంది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతులు అక్రమ



అరెస్ట్‌లు జరుగుతుంటే సీఎం ఎక్కడ. షోలాపూర్ చౌరాస్తాలో నిలబడినా.. రేవంత్‌ను ఎవరూ గుర్తుపట్టరు" అంటూ వ్యాఖ్యలు చేశారు. కనీసం సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర

..మిగతా 2లో



## జార్ఖండ్‌లో తొలిదశ ఎన్నికలు పూర్తి

### 59.28 శాతం పోలింగ్

రాంచీ, న్యూఢిల్లీ, నవంబర్ 13 (ప్రభాత ఉదయం): జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశ పోలింగ్ ప్రశాంతంగా సాగింతోంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి 59.28 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఇసి సమాచారం ప్రకారం.. సరాయికేలా-ఖర్సావాలో అత్యధికంగా 66.38 శాతం పోలింగ్‌తో ముందంజలో ఉండగా, లోహర్‌దాగా, సిమ్‌దేగా నియోజకవర్గాలు వరుసగా 65.99శాతం, 64.31శాతాలలో రెండవ స్థానంలో కొనసాగుతున్నాయి. రాంచీలో అత్యల్పంగా 53శాతం ఓటింగ్ నమోదైనట్లు ఇసి పేర్కొంది. దశలో ప్రముఖ క్రికెట్ ప్లేయర్ ఎం.ఎస్.ధోనీ రాంచీలో తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పోలింగ్ కొనసాగుతోందని, డ్రోన్లతో భద్రతను

..మిగతా 2లో

# వికారాబాద్ ఘటనపై ప్రభుత్వం సీరియస్

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నప్పుడు ఈ తరహాలో వ్యవహరించలేదని బీఆర్ఎస్ తీరుపై భట్టి మండిపడ్డారు. ఉద్యమంలో కూడా అమాయకులను రెచ్చగొట్టా రని, మీ కోసం అమాయక ప్రజలు బలి కావాలా అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. దాడి ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అధికారులపై దాడి చేయడం అమానుషమని, అధికారం కోల్పోవడంతో ఫ్రస్టేషన్ లో బీఆర్ఎస్ నేతలు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడి చేసిన వారితో పాటు దాడికి ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను, పాల్గొన్న వారిని విడిచిపెట్టమని.. అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడిన వారు కేటీఆర్‌తో ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయవచ్చని సూచించిన మంత్రి.. కలెక్టర్, అధికారులపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఇక ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నవాళ్లు జైలు ఊచలు



లెక్క పెట్టాల్సిందే.. వారు ఎక్కడ దాక్కున్న రప్పించి జైలుకు పంపిస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ పత్తి కొనుగోళ్లపై నెలకొన్న సందిగ్ధంపై నోరు మెదపడం లేదని.. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కనీసం పత్తికి మద్దతు ధర గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. నోరు తెరిస్తే మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటామని మాట్లాడుతున్నారు తప్ప రైతుల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొందరు రైస్ మిల్లర్ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. రైతులను ఇబ్బందులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని.. రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. వారం రోజులల్లోగా మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే రైతులు వరి కోతలు ప్రారంభించారని.. రైస్ మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతీ పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. 24 లక్షల ఇళ్లు పేదలకు ఇస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని.. ఇచ్చిన మాట ప్రకారం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం డబ్బులు ఇస్తామని ఆయన చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల ఎంపిక చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలోనే రోల్ మోడల్‌గా కొత్త ఆర్‌వోఆర్ చట్టం తీసుకు వస్తామన్నారు. రూ.2 లక్షలకుపైగా ఉన్న రైతుల రుణమాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

## ఈనెల 15,16,17 తేదీలలో రాంబాగ్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు

రాజేంద్రనగర్, నవంబరు 13(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్ రామాలయ ప్రాంగణం గ్రౌండ్ లో నిర్వహించే సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి 6వ కుస్తీ పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీలు నవంబర్ తేది 15,16,17 మూడు రోజులు నిర్వహించబడే కుస్తీ పోటీల ఏర్పాట్లను జేసీబీ తో గ్రౌండ్ ను చదును చేయించారు. ఈ ఏర్పాట్లను నారగూడెం మల్లారెడ్డి , రాజు పహిల్వాన్ , పి. మల్లేష్ యాదవ్, సాబాద విజయ్ కుమార్, పి. సుధాకర్ రెడ్డి, విజయ్ రావుత్, గురు, అనిల్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జి. కిషన్ రెడ్డి ని (కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ). డాక్టర్ కె. లక్ష్మన్ ని లను, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు , గోషామహల్ ఎం. ఎల్. ఏ. రాజసింగ్ లను ఆహ్వానించారు. నారగుడెం మల్లారెడ్డి , గొరిగే రాజు పైల్వాన్ ల ఆధ్వర్యంలో నిర్వహించే కుస్తీ పోటీలు ప్రతిఏటా మూడురోజులు నిర్వహిస్తారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి జంట నగరాలనుంచి అనేక మంది ప్రముఖులు క్రీడాకారులు పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్ తో పాటు నగదు బహుమానం అందజేస్తారు. వేలాదిగా తరలివచ్చే వీక్షకులకు అన్నిరకాల సదుపాయాలు చేయమన్నారు.



కుస్తీ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

## 21, 22 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన

**మొదటి పేజీ తరువాయి...**

ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆమె ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా ఏర్పాట్లు, సరైన ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు అన్ని వేదికల వద్ద తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, టెండర్లను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. వైద్యారోగ్యశాఖ సహాయక సిబ్బందితోపాటు అర్హులైన వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రపతి బస చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఓంజఆ శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ ను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం, ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## దేశంలో ఇక బుల్డోజర్ న్యాయం చెల్లదు

**మొదటి పేజీ తరువాయి...**

చిత్రీకరించలేమని, దాని ఆధారంగా వాళ్ల ప్రాపర్టీలను నాశనం చేయడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. కేవలం నిందితులో లేక దోషులో అయినంతమాత్రానా, వాళ్ల ఇండ్లను కూల్చడం రాజ్యాంగవ్యతిరేకమే అవుతుందని సుప్రీంకోర్టు చెప్పింది. వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను అక్రమంగా కూల్చుతున్నారని వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు న్యాయవిచారణ చేపట్టింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసుల్లో తీర్పును ఇచ్చింది. నిందితుల ఇండ్లను కూల్చడం రాజ్యాంగ వ్యతిరేకం అని, అలాంటి చర్యలకు పాల్పడిన అధికారులపై పెనాల్టీ వేయాలని కోర్టు సూచించింది. నిందితులు, దోషులకు కొన్ని హక్కులు ఉంటాయని కోర్టు చెప్పింది. ఈ క్రమంలో బుల్డోజర్ల న్యాయంపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. రాత్రికి రాత్రే మహిళలు, చిన్నారులను వీధుల్లో చూడడం సంతోషకరమైన అంశం కాదు అని కోర్టు వెల్లడించింది. ఇండ్లను, అక్రమ ప్రాపర్టీలను ధ్వంసం చేసే పక్రియను వీడియో తీయాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రజాభూమిలో అక్రమ నిర్మాణం చేపడితే తమ ఆదేశాలు ఆ కేసుల్లో అమల్లోకి రావు అని కోర్టు తెలిపింది. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత పక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.'కార్యనిర్వాహక అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఆ అధికారి న్యాయమూర్తిగా మారి, నిందితుల ఆస్తులను కూల్చివేయాలని నిర్ణయం తీసుకోలేరు. ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు.. అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..?అలాగే అక్రమకట్టడాల తొలగింపు కోసం ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలి. అంతేగాకుండా మూడు నెలల్లో మున్సిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపు నిచ్చింది. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగి స్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది.




## ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్య విద్య

**మొదటి పేజీ తరువాయి...**

మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. దర్భంగా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధాని మోదీ ఎయిమ్స్ దర్భంగాను ప్రారంభించారు. 1260 కోట్ల రూపాయలతో భాగల్‌పూర్ ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. ఆరోగ్య రంగంలో ప్రధానంగా ఐదు అంశాలపై మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదలకు మంచి ఆరోగ్య సౌకర్యాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ప్రధాన మంత్రి అన్నారు. దర్భంగా ఎయిమ్స్ బీహార్ ఆరోగ్య రంగంలో భారీ మార్పు తీసుకువస్తుందని ఆయన అన్నారు.దేశప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, వారి జీవితాలను సులభతరం చేయడం మా ప్రధాన కర్తవ్యమని ప్రధాని మోదీ అన్నారు. దర్భంగా ఎయిమ్స్ నిర్మాణంతో మిథిలా, కోసి, తిర్హట్ ప్రాంతాలతో పాటు, పశ్చిమ బెంగాల్, అనేక పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సౌకర్యాలు ఉంటాయి. పొరుగు దేశం నేపాల్ నుండి వచ్చే రోగులు కూడా ఈ ఆసుపత్రిలో చికిత్స పొందగలరు.దేశంలో ఆరోగ్యానికి సంబంధించి మా ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మా మొదటి దృష్టి వ్యాధి నివారణపై ఉంది. వ్యాధిని సక్రమంగా నిర్ధారించడంపై రెండో దృష్టి, ప్రజలకు ఉచితంగా, చౌకగా వైద్యం అందించడం, వారికి తక్కువ ధరకే మందులు అందజేయడం, వైద్యుల కొరతను అధిగమించడం, చిన్న పట్టణాల్లోనూ అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించడం నాల్గవ దృష్టి. దేశంలో ఐదవ దృష్టి ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తరించడం ముఖ్యమని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలోని పేదల జీవితాల్లో పెనుమార్పు తెస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పథకం కింద దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది చికిత్స పొందారు. ఆయుష్మాన్ భారత్ పథకం లేకుంటే వీరిలో ఎక్కువ మంది ఆసుపత్రిలో చేరి ఉండేవారు కాదు. ఆయుష్మాన్ యోజన ద్వారా కోట్ల కుటుంబాలు దాదాపు రూ.1.25 లక్షల కోట్లు ఆదా చేశాయని అన్నారు. బిహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్.. 14 రోజుల రిమాండ్

**మొదటి పేజీ తరువాయి...**

వికారాబాద్ శిక్షణా కేంద్రం నుంచి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరిగి పోలీస్‌స్టేషన్లో మరింత సమాచారం సేకరించిన అనంతరం కొడంగల్‌కు భారీ బందోస్తు మధ్య నరేందర్ రెడ్డిని తీసుకెళ్లారు. అక్కడి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. లగచర్ల దాడి కేసులో పోలీసులు ఇప్పటి వరకు 21మందిని అరెస్టు చేశారు. లగచర్ల ఘటనపై రిమాండ్ రిపోర్టులో పోలీసుల కీలక అంశాలు వెల్లడించారు. ఇప్పటి వరకు 16 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించిన పోలీసులు అభిప్రాయ సేకరణ కోసం వచ్చిన కలెక్టర్ సహా ఇతర అధికారులపై కొందరు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్, కడా అధికారి వెంకట్‌రెడ్డిపై హత్యాయత్నం చేశారన్నారు. సురేష్ అనే వ్యక్తి అధికారులను గ్రామంలోకి తీసుకువెళ్లాడన్న పోలీసులు ఇదే సమయంలో వారిపై దాడి సహా వాహనాలపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారన్నారు. ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించిన పోలీసులు, దాడిలో ఉపయోగించిన రాళ్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రిమాండ్ రిపోర్టులో 46మందిని నిందితులుగా పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న వారిలో 19 మందికి భూమే లేదని ఐజీ సత్యనారాయణ తెలిపారు. మరోవైపు నరేందర్ రెడ్డి అరెస్టును గులాబీ నేతలు ఖండించారు. పట్నం నరేందర్ రెడ్డి నివాసంలో ఆయన భార్య శృతి, మిగతా కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు.



## జార్ఖండ్‌లో తొలిదశ ఎన్నికలు పూర్తి

**మొదటి పేజీ తరువాయి...**

పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 46.25 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల కమిషన్ (ఇసి) ప్రకటించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన భార్య కల్పనా సోరెన్‌లు రాంచీలో తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు జార్ఖండ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని హేమంత్ సోరెన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గుమ్లా నియోజకవర్గం 52.11 శాతం పోలింగ్‌తో ముందంజలో కొనసాగుతుండగా, లోహర్‌దాగా, ఖుంటిలు వరుసగా 51.53 శాతం, 51.37 శాతం పోలింగ్‌తో రెండవ స్థానంలో కొనసాగుతున్నట్లు ఇసి తెలిపింది. రాష్ట్ర రాజధాని రాంచీలో మధ్యాహ్నం సమయానికి అత్యల్పంగా 40.98శాతం పోలింగ్ మాత్రమే నమోదైందని పేర్కొంది. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ సీట్లలో 43 స్థానాలకు నేడు తొలిదశలో ఓటింగ్ కొనసాగుతోంది. మరో 38 స్థానాలకు నవంబర్ 20న రెండవ దశలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్‌కు అనుమతించారు. కొన్ని బూత్‌ల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుంది. భద్రత కోసం 200కుపైగా కంపెనీల భద్రత దళాలను మోహరించారు. బుధవారం దేశవ్యాప్తంగా మరో 31 అసెంబ్లీ స్థానాలు, కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది, రాజస్థాన్‌లో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అస్సాంలో ఐదు, బీహార్, పంజాబ్‌ల్లో నాలుగేసి స్థానాలు, కర్ణాటకలో మూడు, కేరళ, మధ్యప్రదేశ్‌ల్లో రెండేసి స్థానాలకు, ఛత్తీస్‌గఢ్, గుజరాజ్, మేఘాలయలో ఒకొక్క స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

## సీఎం రేవంత్‌ది తుగ్లక్ పాలన

**మొదటి పేజీ తరువాయి...**

పెద్దలను తాను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్‌ను కలవటం కూడా తప్పే అని అన్నారు. కొడంగల్ రైతులు ఆరేడు నెలలుగా రగులుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదని మండిపడ్డారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని చెప్పి.. మళ్ళీ యూటర్న్ ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఫార్మా సిటీ నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి చెప్పారు. అయితే సీఎం సొంత అల్లుడు సత్యనారాయణ రెడ్డి మాక్స్ బీఎన్ ఫార్మా కంపెనీ విస్తరణ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు వెళ్ళని రేవంత్.. మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మాత్రం వెళ్తారన్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# యువ శాస్త్రవేత్తలను, నిపుణులను, రైతులను
# ఆలోచింపచేసిన వ్యవసాయ అనుబంధ ప్రదర్శనలు



సదస్సులో మాట్లాడుతున్న ఐటీసీ అగ్రి ఐటీ బిజినెస్ హెడ్ ఎస్. శివ కుమార్


చిరు ధాన్యాల స్టాల్


కరెంటుతో సోలార్‌తో పనిచేసే డ్రయర్ తయారు చేసిన కోయంబత్తూరు కు చెందిన యువ నిపుణులు ఎన్. విదు బాలు

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్)లో రెండు రోజులుపాటు సుస్థిర వ్యవసాయంలో స్టార్టప్ ల దోహదం అనే థీమ్ తో జరిగిన జాతీయ సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి యువ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనురంగ సంస్థల నిపుణులు, రైతులు, వ్యవసాయ విభాగం అధికారులు పాల్గొన్నారు. నార్మ్ డైరెక్టర్, నార్మ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ అయిన ఎ ఐడీయా చైర్మన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు. ప్రిన్సిపల్ సెంటీస్ట్ లు డాక్టర్ సెంథిల్ వినాయగమ్, డాక్టర్ ఎన్ఎ విజయ్ అవినాషలింగంల పర్యవేక్షణలో ఈ సదస్సు జరిగింది. చివరి రోజు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ వర్చువల్ విధానంలో సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిపుణులు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. సమావేశంలో ఐటీసీ లిమిటెడ్ కు చెందిన ఎస్.శివకుమార్, ఐసీఏఆర్ అసిస్టెంట్ డెరెక్టర్ జనరల్ డాక్టర్ సీమ జగ్గీ , నార్మ్ కు చెందిన డాక్టర్ వి.రామసుబ్రమణ్యన్, డాక్టర్ పి. వెంకటేశన్, డాక్టర్ బి.నిర్మలలు పాల్గొన్నారు.

**ఆలోచింపచేసిన ప్రదర్శనలు, నమూనాలు**

**అనేక ఆలోచనలకు రూపం చేకూరుస్తున్న నార్మ్ ఎ ఐడీయా :**

నార్మ్ లోని ఎ ఐడియా యువ శాస్త్రవేత్తలు, నిపుణులకు శాస్త్రీయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండ వారికి మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తు ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు నార్మ్ ఎ ఐడియా ద్వారా 350 వరకు స్టార్లప్ లను ఏర్పాటు చేయడానికి సహకారం అం దజేశారు. అనేక రకాల వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను వివిధ రూపాలలో మార్కెట్లోకి విడుదల చేయడానికి నార్మ్ ఎ ఐడీయా బాటలు వేసిందని చెప్పవచ్చు.

**రూ.12వేలకే హైబ్రిడ్ సోలార్ డ్రయర్ :**

కోయంబత్తూర్ కు చెందిన ఎన్.విధు బాలు బీఈ, ఈఈఈ పూర్తి చేశాడు. వ్యవసాయదారులకు ఉపయోగపడే సోలార్ హైబ్రిడ్ డ్రయర్ కను గొన్నాడు. దీంట్లో ఆహార వస్తువులతో పాటు గుడ్లు కూడా డ్రై చేయడానికి అవకాశాలు ఉన్నాయి. ఆహార ఉత్పత్తులను ఆరబెట్టి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసుకునే విదంగా ఈ హైబ్రీడ్ సోలార్ డ్రయర్ ఉపయోగపడుతుందని విధు బాలు తెలిపారు. ఇది రూ.12వేలకు లభ్యమౌతుందని, పెద్దది కావాలంటే రూ. 65వేలు ఉంటుందన్నారు.



ఉద్యోగాన్ని వదిలి వ్యవసాయ దారులకు అండగా నిలిచిన డాక్టర్ రాఘువేందర్

**కొర్రలతో డ్రింక్:**

పామ్నుట్రా మిల్లెట్ వుడ్ పేరుతో ఎం.ఫార్మసీ చేసిన శైలేష్ చిరు దాన్యాలైన కొర్రల తో చేసి డ్రింక్ మధుమేహం తో బాధపడుతున్న వారికి ఎంతో ఉపయోగంగా ఉంది. చిరుదాన్యాలు నేరుగా తినడానికి ఇబ్బంది పడే వారికి ఈ మిల్లెట్ డ్రింక్ బాగుంటుందని ఆయన వివరించారు. ఐడీఏ బొల్లారం లో గల పరిశ్రమలో ఈ డ్రింక్ తయారు చేస్తున్నారు. మిల్లెట్ డ్రింక్లో కొర్రలతో పాటు పండ్ల రసాలను కలుపుతున్నారు.

**ఆకట్టుకున్న మిల్లెట్ జామ్, విజిటేబుల్ జామ్ లు :**

నార్మ్ లో జరిగిన స్టారప్ సదస్సులో చిరుదాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ జామ్, కూరగాయలతో తయారు చేసిన విజిటేబుల్ జామ్ లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బ్రౌన్ షుగర్ ను కలపి వీటిని తయారు చేశారు. బీటెక్ చేసిన హరిప్రసాద్ ఈ మిల్లెట్ జామ్ ను తయారు చేసి అంద బాటులో ఉంచాడు.

**కూరగాయలు, పండ్లను ముక్కలుగా చేసి డ్రై చేసే పెగ్యురల్ టెక్నాలజీస్ :**

కర్ణాటకకు చెందిన మెకానికల్ ఇంజనీర్ సందీప్ కూరగాయలు, పండ్లను ఆరబెట్టడానికి పెగ్యురల్ టెక్నాలజీస్ పేరుతో అడ్వాన్స్ అడాప్టబుల్ అ గ్రికల్చరల్ సిస్టమ్స్ ను రూపొందించాడు. 30 డిగ్రీల నుంచి 60 డిగ్రీల లోపు ఆహార వస్తువులను డ్రై చేయడం ఎలా అనే పద్ధతిపై ఆయన పరిశోధనలు చేసి ఈ టెక్నాలజీని తయారు చేశారు. రెండు వేల గజాల స్థలంలో వేర్ హౌసింగ్ విధానంలో ఈ డ్రయర్లు పనిచేస్తాయి.



నార్మ్ ఏ ఐడియా స్టాల్

**ఉద్యోగాన్ని వదిలి వ్యవసాయదారులకు మేలు చేస్తున్న డాక్టర్ రాఘువేందర్ :**

అగ్రికల్చరల్ లో పీహెచ్ఎ పూర్తి చేసి రెండు సంవత్సరాల పాటు వ్యవసాయ అదికారిగా పనిచేసిన మహబూబ్ నగర్ కు చెందిన డాక్టర్ రాఘువేం దర్ ఉద్యోగాన్ని వదిలి వ్యవసాయ రైతులకు మేలు చేసే విదంగా కేతూరి అగ్రిటెడ్ ప్రైవేట్ లిమిటెడ్ ను ఏర్పాటు చేశాడు. దాని ద్వారా నాణ్యమైన వ్యవసాయ మందులు, సాగు విధానాలలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి రైతులకు ఉపయోగపడే విదంగా పనిచేస్తున్నాడు. వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు చేరవేయడంలో మధ్య దళారీల ప్రమేయం లేకుండ తక్కువ ధరలకే వాటిని రైతులకు చేరవేస్తున్నాడు.

**రైతుల పొలాలలో బోర్ అన్ అఫ్ పాటు కరెంటు ను సెల్ ఫోన్ ద్వారా నియంత్రించే న్యాస్త్రా**

న్యాస్త్రా గ్రామోజ్వల సోలుష్యన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో రైతుల పొలాలలో ఉండే బోర్ ను సెల్ ఫోన్ ద్వారా ఆన్ ఆఫ్ చేయడంతో పాటు కరెంటు లైట్లు కూడా అన్ అప్ చేయడం పై నలుగురు యువ నిపణులు న్యాస్త్రా స్మాల్ మోటర్ మేనేజిమెంట్ ను రూపొందించారు. ఇది కేవలం రూ. 4వేలకే లభ్యమౌతుంది. ఈ విధానం రైతులకు ఎంతగానో నచ్చింది. బాల బార్గవి నరిశెట్టి, రాగుల ప్రశాంత్ రెడ్డి, రేకులపల్లి నరోత్తంరెడ్డి మిర్దేష్ లు ఈ పరికరాన్ని కనిపెట్టారు.


ఉద్యాన విశ్వవిద్యాలయం వైఎస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

## ఉద్యాన విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం) : శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ంలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది, టైం స్కేల్ సిబ్బంది సమస్యలు వరిష్కరించాలని బుధవారం ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డిని కలసి వినతి పత్రాలు అందజేశారు. వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.చెంచురామయ్య ల అధ్వర్యంలో పలువురు ఉద్యోగులు వీసీని కలిశారు. అనంతరం వీసీ డాక్టర్ రాజరెడ్డిని నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఆసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు టి.కుమార్, ఎం.రజనీకాంత్, రత్నం, దీపారాణి, వంశీకృష్ణ, తులసీరాణి, యుగందర్, వెంకటేశ్, విజయ్ కురుమూర్తి, వెంకటస్వామీ, బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ దండ రాజ రెడ్డితో ఉద్యోగులు


ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలసిన పాస్టర్లు

## క్రైస్తవ సంఘాలకు కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలి

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్‌లో ఉన్న క్రైస్తవ సంఘాలకు ఒక కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలని, డిసెంబరు మాసంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు సహకరించాలని కోరుతు బుధవారం రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ను కలిశారు. క్రైస్తవ సంఘాల క్షేమం కోసం అండగా ఉండాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె.సుందర్ పాల్, ఉపాధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి రెవరెండ్ జేపీ పాల్, కమిటీ సభ్యులు రెవరెండ్ డి. ఆనంద్ పాల్ , పాస్టర్ జే పాల్ దేవరాజ్, పాస్టర్ సీహెచ్ దినకర్ లు ఉన్నారు.



## నేడు రాజేంద్రనగర్, కిస్మత్‌పూర్‌లలో విద్యుత్ సరఫరాల అంతరాయం

రాజేంద్రనగర్, నవంబరు 13(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్, కిస్మత్ పూర్ లలో గురువారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయా సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్లు దుర్గాప్రసాద్, మల్లేష్ రాజులు తెలిపారు. రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని జనచైతన్య విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జన చైతన్య కాలనీ, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

**కిస్మత్ పూర్ లలో...**


కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో వివిధ మరమత్రా నిమిత్తం గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్ వి నిర్మాణ్, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కె విల్లా, ఖాదర్ ఎన్ఆర్ఐ ప్రాంతాలు, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కే టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరి దారి, గిరి దారి విష్ట, దర్గా కలుస్తాన్, ఎల్.వి.ప్రసాద్, కీర్తి విల్లాస్, నమః, మ్యాప్ హర్ కన్స్ట్రక్షన్ 80 యాడ్స్, 16 యాడ్ తదితర ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్తు అంతరానికి సహకరించాలని ఆయన కోరారు.


ఉద్యాన విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ దండ రాజి రెడ్డిని కలసి వినతి పత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

## శివాలయానికి దారి వదలండి

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం) : శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ ని అనుకున్న ఉన్న శివాలయంలో పూజలు చేసుకోవడానికి దారిని వదలాలని కోరుతు బుధవారం బీజేపీ నాయకులు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాలకు వచ్చిన ఆయనను బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్రెడ్డి, నాయకులు వై.శ్రీధర్ జి.బాబురావు, రంగ రజనీకాంత్, ఇ.శ్రీనివాస్లు కలసి వినతి పత్రం అందజేశారు. 'పాలకమండలి సమావేశంలో మాట్లాడి నిర్ణయం ప్రకటిస్తామని వీసీ రాజరెడ్డి తెలిపినట్లు వారు వెల్లడించారు.

## సిద్దేశ్వరీ ఆత్మహత్యకు భర్త, అత్తమామల వేదింపులే కారణం


సిద్దేశ్వరీ, ప్రవీణ్‌లు

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం): తన కూతురు సిద్ధేశ్వరీ ఆత్మహత్యకు భర్త, అత మామలు, ఆడపడుచు ఆమె భర్త వేదింపులే కారణమని సిద్ధేశ్వరీ తండ్రి సంగనాథ్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సిద్ధేశ్వరీ భర్త ప్రవీణ్, అత్త మామలు జయశ్రీ. శివరాజ్, ఆడపడుచు ప్రియ. ఆమె భర్త బస్వరాజ్లపై కేసు నమోదు చేశారు. బుధవారం సాయ ంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రవీణ్ భార్య సిద్దేశ్వరీ భర్తతో ఫోన్లో మాట్లాడిన అనంతరం చ న్నీతో ఇంటి గ్రిల్స్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కూతురు మరణవార్త గురించి తెలుసుకున్న కామారెడ్డి మద్నూర్ కు చెందిన సంగనాథ్ తో పాటు వారి బందువులు రాంబాగ్ కు చేరుకుని పోలీసులకు పిర్యాదు.. చేశారు. ఏడు నెలల క్రితం తన కూతురు. సిద్ధేశ్వరి(20) తో ప్రవీణ్ కు వివాహం జరిగిందని, ఆ సమయంలో రూ. 5లక్షలు, ఐదు తులాల బంగారం ఇచ్చామన్నారు. వెళ్లయిన వాటి నుంచి మరో రూ. 5. లక్షలు తెమ్మని తమ కూతురును వేదిస్తున్నారన్నారు. అందుకే తన కూతురు ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పిర్యాదు లో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీ కు వినతి పత్రం అందచేస్తున్న వనంపల్లి జైపాల్ రెడ్డి

## జలమండలిలో జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

బుద్వేల్, నవంబరు13(ప్రభాత ఉదయం): జలమండలి లో వాటర్ సప్లై విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జీవో నెంబర్ 60 ప్రకారం రూ.19,500లు, కంప్యూటర్ ఆపరేటరు రూ. 22,750లు చెల్లించాలని ఏఐటీయుసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇదే విషయమై బుధవారం రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మిని కలసి వినతి పత్రం అందజేశారు. సిబ్బంది జీత భత్యాలను పెంచాలని 2021లో జీవో ఇవ్వగా ఇప్పటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అప్పడి మంచి సిబ్బందికి రావాల్సిన ఏరియర్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే జలమండలి కార్యాలయం ముందు ధర్మా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


వాలంతరీలో కలసి ఉద్యోగం చేసిన వారు పెళ్ళిలో కలసి ఇలా ఆనందంగా....

## పెళ్లిలో కలుసుకున్న కలసి ఉద్యోగం చేసిన స్నేహితులు

బుద్వేల్, నవంబరు 13(ప్రభాత ఉదయం): హిమాయత్ సాగర్ లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(వాలంతరీ) లో 1989 నుంచి 2024 వరకు వివిధ హొదాలలో పనిచేసిన సిబ్బంది. బుదవారం అత్తాపూర్ లో ఒకే వేదిక వద్ద కలుసుకున్నారు. వాలంతరీ లో ఉద్యోగం చేసే వి.అమ్మన్నబాబు కూతురు వివాహ వేడుకలలో వీరు కలుసుకుని ఎంతో ఆప్యాయంగా పలకరిం చుకున్నారు. అందులో చాలా మంది పదవీ విరమణ పొందారు. మానవ విలువలు ముఖ్యమని చాటిచెప్పిన వీరిని చూసి వెళ్లికి వచ్చినవారు ఎంతో సంతోషించారు.


# వరి ధాన్యాన్ని అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు అకౌంట్లో జమ చేయాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పౌరా సరఫరాల శాఖ అధికారి ప్రసాద్


సివిల్ సప్లైస్ గోదామును పరిశీలిస్తున్న అధికారి ప్రసాద్

## పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్

కొత్తకోట, నవంబర్ 13(ప్రభాత ఉదయం) వరి ధాన్యాన్ని అమ్మిన రైతుకు సకాలంలో డబ్బులు అకౌంటులో జమ చేయాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వి.ఎస్. ఎన్. వి.ప్రసాద్ అన్నారు.బుధవారం పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వి. ఎస్.ఎన్ .వి. ప్రసాద్ వనపర్తి జిల్లాను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మదనాపూర్ లోని ఐ.కే.పి వరి కొనుగోలు కేంద్రాన్ని, తిర్మలయపల్లి, కొత్తకోట లో పి.ఏ.సి.ఎస్ ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు తో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన రైతుకు డబ్బులు వారి ఖాతాలో జమ అయినాయా అని ఆరా తీయగా డబ్బులు జమ చేయడం జరిగిందని నిర్వాహకులు సమాధానం ఇచ్చారు. ఒక రైతు ఫోన్ నెంబర్ ఇవ్వండి అని అడిగి డైరెక్టర్ నేరుగా రైతుతో ఫోన్ లో మాట్లాడారు. అమ్మిన ధాన్యానికి త్వరగానే డబ్బులు జమ అయ్యాయి అని రైతు సమాధానం ఇవ్వడంతో డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, విశ్వనాథం,తదితరులు డైరెక్టర్ వెంట ఉన్నారు.


వివాహ వేడుకల్లో నూతన వధువు వరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

కొత్తకోట, నవంబర్ 13(ప్రభాత ఉదయం) వివాహ వేడుకల్లో నాయకులు పాల్గొని నూతనవదు వరులను ఆశీర్వదించారు. నవ వధూవరులను ఆశీర్వదించిన వారిలో సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, గద్వాల్ మాజీ మార్కెట్ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, అనంతపురం నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాపయ్య గారి కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి బి రాములు, మూలమల్ల కృష్ణ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

## ధాన్యం కొనకపోవడంతో మార్కెట్‌కు రైతులు

### తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు..

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 14(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పండించిన పంటలు అమ్ముకోలేక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం గద్వాల మండలంలోని లత్తిపురం, బీరెల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ...వరి కల్లాలలో ఆరబోసిన వరి ధాన్యం అకాల వర్షాలు కురిసి తడిసిన ధాన్యం తో రైతులు నానా తిప్పలు పడుతున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడం చాలా బాధాకరమని అన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు మార్కెట్ కు పోయి తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కు ఇప్పటికే దాదాపు 5 వేల క్వింటాళ్ల ధాన్యంను రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని వారందరు కేంద్రప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 ను కోల్పోయారని ఆరోపించారు. ప్రభుత్వం బయటకు మాత్రం కొంటున్నామని చెబుతన్నా కేంద్రాలలో ఆ పరిస్థితి లేదని అన్నారు. అంతా అబద్ధాలతో పాలన జరుగుతుందని విమర్శించారు. ప్రస్తుతం తుఫాన్ వచ్చే పరిస్థితి ఉందని ధాన్యం తడవకుండా టార్పాలిన్ లను ఇవ్వాలని కోరారు. కేంద్రం సబ్సిడితో ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన బోనస్ హామీని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. సన్నాలకే కాకుండా అన్ని వరి ధాన్యాలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రాలలోకి ధాన్యం వస్తే అన్ని ఖర్చులను ప్రభుత్వమే భరించాలని కోరారు. రాష్ట్ర ప్రభత్వం రుణమాఫీ చేస్తామని అందరికి మాఫీ చేయలేదని, రైతుబంధు ఇప్పటి వరకు ఒక పంటకు ఇవ్వలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మూడు రోజులలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బండల వెంకట్రాములు, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మీర్జాపూరం వెంకటేశ్వర రెడ్డి ,రాష్ట్ర బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఢిల్లీవాల క్రిష్ణ, బిజెపి నాయకులు ఓంకార్, మధుసూదన్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాసులు, పాండు, రైతులు తదితరులు ఉన్నారు.



ఉపన్యాస పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

## ఉపన్యాస పోటీలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి

### విజయవంతమైన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

### నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ

గద్వాల టౌన్, నవంబర్ 13(ప్రభాత ఉదయం) ఉపన్యాస పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థులు భవిష్యత్తులో మంచి నైతిక విలువలు గల పౌరులుగా ఎదుగుతారని నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ అన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లాలోని మొత్తం 13 మండలాల నుంచి మొత్తం 26 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాస పోటీల గురించి నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షులు పాల్వాయి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపన్యాస పోటీల వల్ల విద్యార్థులలో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు, పోటీ పరీక్షలు ఎదుర్కొనే ధైర్యం, పోటీ వాతావరణం మొదలైనవి విద్యార్థులకు తెలుస్తాయని ముఖ్యంగా నలుగురిలో మాట్లాడాలంటే భయం పోతుందన్నారు. ప్రభుత్వాలు ఓట్ల కోసం ఉచిత పథకాలు ప్రకటించి అధికారంలోకి వస్తున్నారని దాని ద్వారా ఆర్థిక అసమతుల్యత ఏర్పడి రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకపోతున్నాయన్నారు. నేటి విద్యార్థులే రేపు కాబోయే ఓటర్లు కావున ఇప్పటినుంచి విద్యార్థులకు ఓట్ల గురించి ఉచితల గురించి సరైన అవగాహన ఉండాలని ఉద్దేశంతో ఉపన్యాస పోటీలు నిర్వహించామన్నారు. ఉపన్యాస పోటీల ద్వారా తరగతి నాలుగు గోడల మధ్య మాట్లాడే స్థాయి నుంచి బహిరంగ ఉపన్యాసాలు ఇచ్చే స్థాయికి విద్యార్థులు ఎదుగుతారని అన్నారు జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల విజేతలు మొదటి బహుమతి నోబుల్ స్కూల్ విద్యార్థిని మంజుల మొదటి బహుమతి సాధించగా విజేతకు రమేష్ స్పోర్ట్స్ గద్వాల వారు రూ.5016నగదు అందజేశారు. రెండవ బహుమతి మనీషా -జెడ్పీహెచ్ఎస్ ధరూర్ సాధించగా విజేతకు దాత అవని 3016 రూపాయలు అందజేశారు. మూడవ బహుమతి శివ నాగరాజు హరిజనవాడ జడ్పీ హెచ్ ఎస్ సాధించగా విజేతకు పి చంద్ర శేఖర్ రూ.2016 అందజేశారు. నాల్గవ బహుమతి స్పందన %్గానూ% బిజ్వారాం విజేతకు ఆశ్రయ ఫౌండేషన్ వారు రూ.1016 అందజేశారు. ఐదవ బహుమతి సర్వర్ %్గానూ% ఐజ విజేతకు గ్రామ స్వరాజ్యం వారు రూ.516 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ హై స్కూల్ హెచ్ఎం ఇమ్మానుయేల్, నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్, అమరేందర్ రెడ్డి, బుచ్చన్న, జిల్లా సోషల్ ఉపాధ్యాయులు రాజు, రామచంద్రుడు, ఈదన్న ,నాగరాజు, శ్రీహరి, రాజు సాగర్, జనార్ధన్, పరశురాం, లింగారెడ్డి, మద్దిలేటి కృష్ణకుమారి, దాతలు అవని శ్రీ వీరేష్, ప్రతాప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కని మెట్ట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్

## రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్

కొత్తకోట, నవంబర్ 13(ప్రభాత ఉదయం) ప్రభుత్వం రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించాలని లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఈ కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె పాగు ప్రశాంత్ అన్నారు. బుధవారం కొత్తకోట మండలంలోని కనిమెట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లే పాగు ప్రశాంత్ ప్రారంభించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సూచన మేరకు కనిమెట్ట గ్రామంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వరి ధాన్యం ఐకేపీ మహిళ సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐకేపీ మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లే పాగు ప్రశాంత్, సీడీసి ఛైర్మన్ గొల్ల బాబు,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీత పెంటయ్య,పురుషోత్తం, బుడ్డ భగవంత్,ఎరుకలి రాములు,అంజలన్న, హరినాథ్ రావ్,ఎస్సెసెల్ రవి, డైమాండ్ వెంకటేష్,బుచ్చన్న, అబ్దుల్లా,చింటు,సుధీర్ రెడ్డి, మేపాల్ రెడ్డి,ఈడిగి మన్నెం, జానమ్మ,చెన్నమ్మ,ఈదమ్మ, పద్మమ్మ,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ముసుగులో బిఆర్ఎస్ దాడి

### అధికారులపై దాడి హేయమైన చర్య: వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి



కొత్తకోట, నవంబర్ 15(ప్రభాత ఉదయం) వికారాబాద్ జిల్లా లగచర్లలో జిల్లా కలెక్టర్ పై అధికారులపై రైతుల పేరుతో జరిపిన దాడి హేయమైన చర్య అని బి ఆర్ ఎస్ ప్లాన్ తోనే అధికారులపై దాడి జరిగిందని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పరిశ్రమలు రాకుండ అడ్డుకునేందుకే కొందరు గులాబి నేతలు గ్రామస్తులకు ఉసిగొల్పి దాడి జరిగేలా చేశారని ఆరోపించారు. రైతుల ముసుగులో బిఆర్ఎస్ విధ్వంసానికి పాల్పడుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావు లేదని. ఎలాంటి సమస్యకైనా చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రతినిధులపై దాడి లిచేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడంగా పరిగనించవలసి వస్తుందన్నారు. దోషులను వెంటనే శిక్షించాలని,నిందితుల వెనుక ఉన్న వారిని కూడ శిక్షించాలని కోరారు.

## నూతన వధూవరులు నిహతి,సాయి చరణ్‌లను ఆశీర్వదించిన పెద్దలు

కొత్తకోట, నవంబర్ 13(ప్రభాత ఉదయం) మదనాపురం మండల కేంద్రానికి చెందిన చిగుళ్ళపల్లి భాగ్యలక్ష్మి , వెంకట రమణ కూతురు నిహతి,సాయి చరణ్ వధూవరుల వివాహం కొత్తకోట పట్టణంలోని .పి.ఆర్. గార్డెన్స్ జరిగింది. ఈ వివాహానికి రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు మూలమల్ల మోహన్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, గోనూరు సత్యనారాయణ, గోనూరు రామకృష్ణ, మాజీ ప్రధాన ఉపాధ్యాయులు ఎం శేఖర్, మాజీ ఎంపీటీసీ బి రాములు, తదితరులు హాజరై నూతన వధువు వదలను ఆశీర్వదించారు


నూతన వధూవరులు నిహతి,సాయి చరణ్‌లను ఆశీర్వదించిన పెద్దలు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.